ఊహాలోకాల్లో విహరిస్తూ ఉంటారు, భారతదేశపు యువతులు! అందులో మధ్యతరగతికి చెందిన వాళ్ళు, కాలేజీలో చదువుకునే ఆడపిల్లలు భావనాజగత్తులోనే నివసిస్తూ ఉంటారు. గాలితరంగాలలో ప్రేమసౌధాన్ని నిర్మించుకుని, ఆ ప్రేమనగర్‌లో ఒక విశాల హృదయుడైన శ్రీమంతుణ్ణి, సౌందర్యవంతుణ్ణి భావించుకుని భవిష్యత్ జీవితాన్ని గూర్చి కలలు కంటూఉంటారు కలలు....కలలు....నిజమైన జీవితంలో దిగిన తర్వాత, కలలు గాలిలో ఫలించవని, అవి ఫలించడానికి యిలలోని ఆర్థిక సామాజిక శక్తులు కారణమవుతాయనీ గ్రహించుకుంటారు గ్రహించగలిగేప్పటికే కొంతమంది చేతులు కాలిపోయి ఉంటాయి. కొంతమందికి కాలకముందే ఆర్థిక సామాజికశక్తులే ఆకులై కాల



కుండా ఆపుతాయి.

* * *

"లలితా! ఓ లలితా!" స్నేహితు రాళ్ళి కేకేస్తూ హాల్లోకి వచ్చారు పద్మ, మంజరి. "రండర్రా, రండి! మీకోసమే గంటనుంచి చూస్తున్నాను!" అంటూ స్నేహితురాళ్ళను ఆప్యాయంగా ఆహ్వానించింది లలిత.

ఏమిటే లలితా! సాయంత్రం నాలుగైనా నిద్దరమొహం అవతారం నువ్వు త్వరగా డ్రస్ చేసుకో, అలా పార్కుకి పోదాం. తొందరగా తెమలాలి సుమా!" అంది పద్మ.

"ఆహా! ఉండవే! అది ఇంకా మన ప్రపంచంలోకి రాలేదు ఇప్పటి దాకా కలలు కంటూ పడుకునిఉంటుంది. ఆ కలల్లో తన అభిమాన రచయిత్రి కథల్లోని నాయకుడు ఠీవిగా చూస్తూ దగ్గరకొస్తుంటే...." అంది మంజరి.

"అబ్బ ఊరుకోవే! నీ కెప్పుడూ వేళాకోళమే!" అని ఉడుక్కుంది లలిత.

లలిత, పద్మ, మంజరి-ముగ్గురు ఆ ఏడే పి. యు. సి. పరీక్షలు వ్రాసారు. చిన్ననాటినుండి వాళ్ళు ప్రాణ స్నేహితురాళ్ళు. వారి మధ్య ఏ రహస్యాలు ఉండవు. ఆ చనువుతోనే మంజరి లలితని వేళాకోళం చేసింది. నిజానికి లలిత ఊహజీవి అనడంలో సందేహంలేదు. తను కాబోయే వరుడు, తన అభిమాన రచయిత్రి నవలల్లో నాయకుడు నిరంజన్‌లా ఉంటాడని ఆమె చాలాసార్లు చెప్పింది. తన నాయకుడు పచ్చని పసిమి ఛాయలో మంచి ఒడ్డు, పొడుగు కల్గి చక్కని కనుముక్కు తీరు కల్గి, ఫుల్‌సూట్‌లో అమ్మాయిలను కవ్విస్తూ ఉంటాడు. అతను ధైర్యస్థైర్యాలకి పెన్నిధి. ఆపదలోవున్న అమ్మాయిల్ని రక్షించడంకోసం ఎందరు రౌడీలనయినా ఓడించగలవాడు వీటి అన్నిటికి తోడు బాగా ఆస్తిపాస్తులు గలవాడు. అందమైన బంగళాముందు చిన్న కారు పక్కన, యింట్లో అలంకరించుకుని వచ్చే తనకోసం ప్రేమపూరిత వీక్షణాలతో ఎదురుచూస్తూ ఉంటాడు. అతనికి ముందూ వెనుకా నా అనేవాళ్ళు ఎవరూ ఉండరు.

ఇలాగే కలలు.... కలలు.... ఎన్నో కలలు.

* * *

లలిత ఒక్కగా నొక్క కుమార్తె తల్లిదండ్రులకి. వాళ్ళు మధ్య తరగతి సంసారులు, లలిత చక్కని చుక్క. అల్లసాని పెద్దనగారి మాటల్లో - విద్యుల్లతా విగ్రహ, శతపత్రేక్షణ, చంద్రాస్య. చక్రస్తని వగైరా-మంజరి, పద్మ వాళ్ల పరిస్థితుల్ని బట్టి చదువు ఆపేసి ఇక ఉద్యోగం చేద్దామనుకున్నారు. రోజూ సాయంత్రం పూట స్నేహితురాళ్ళు ముగ్గురూ లలితా

వాళ్ళ ఇంట్లో డాబామీద కూర్చుని చీకటి పడే దాకా కలల్లో విహరిస్తూ ఉంటారు,

* * *

లలిత అన్నది సీరియస్‌గా—"ఇవాళ పార్కుకి వద్దుగాని, అలాగా గదికి రండర్రా. మీతో ఒక అతి ముఖ్య విషయం మాట్లాడాలి." మంజరి ధోరణి మామూలే ఏమిటే! అంత ముఖ్య విషయం! కొంప తీసి నీ కథానాయకుడు నిరంజన్ నీ యింటికొచ్చి, "నిన్ను ప్రేమిస్తున్నాను నా వెంటరా" అని అన లేదు కదా!

"ఆఁ ఆఁ అదే చెప్తానుగా రండి!" అంటూ గదిలోకి దారి తీసింది లలిత. ముగ్గురు గదిలోకి వెళ్ళి మంచం మీద కూర్చున్నారు. ఉన్నట్టుండి లలిత అన్నది.

"నిన్న, పెళ్ళి చూపులు జరిగాయర్రా."

పద్మ, మంజరి ఒక్కసారిగా అరిచారు. "ఎంతఘోరం! మాకు తెలియకుండానే!" అంటూ గుండెల మీద చేతులు వేసు కున్నారు.

"చూపులు మటుకేగా; ఇంకా ఏం దారుణం జరిగిపోలేదు కదా! గుండెలు బాదుకోకండి. అనుకోకుండా నిన్న మా చుట్టాల ఆయన ఈ సంబంధం పట్టుకొచ్చారు. అక్కడికీ మీ యిళ్ళకి కబురు పెట్టాను అమ్మాయిగార్లు ఎక్కడికో షికార్లకు వెళ్ళారట.

"పోనీ అదిపరేగానీ, నీ పెళ్ళికొడుకు నీ హీరోలా ఉంటాడా? ముందు మాకు అది చెప్పు!"

"రూపం అలాగే ఉంటుంది గానీ, వేషభాషలు మాత్రం ఆలా లేవు. మామూలు పంచె, లాల్చి, బి ఏ. ప్యాసై, వ్యవసాయం చేసుకుంటున్నాడట. పల్లెటూరిలో నివాసం. 15 ఎకరాల భూమి! తల్లిదండ్రులకి ఒక్కడే కొడుకు. అమ్మ ఈ సంబంధం ఒప్పుకోమని నన్ను ఒకటే పోరుతోంది! ఇప్పుడు మీ మీ అభిప్రాయాలు సెలవిండు! ఆ పల్లెటూరిలో ఈ పట్టణ వనిత కాపురం సేయుట సాధ్యమా?" అని.

పద్మకి కాస్త ముందు చూపు ఉంది. ఆమె అంది_"ఎగిరి గంతేసి ఒప్పుకోవే పిచ్చిపిల్ల! చదువు, అందం, ధనం, ఎక్స్ట్రా అన్నీ ఉన్నాయి. పల్లెటూరు నీకు నచ్చదూ, బండా పీకేసి, పట్నంలో కాపురం పెడదాం! బి.ఏ. చదివిన వాడికి ఉద్యోగం దొరకదా!"

మంజరి అన్నది – "పెళ్ళికొడుకు సూటూ బూటూ వెయ్యలేదు, కార్లో రాలేదు అని దిగులుపడకే లలితా! రెండెకరాలమ్మివి కావనుకుంటే రేపీపాటికి కారు తయారు. సూటు, బూటూ అంటావు నువ్వు సెలక్టుచేసి నీ చేతుల్తో తొడిగితే తొడుక్కోక ఏం చేస్తాడు? డిగ్రీ చాలదనుకుంటే పైప్రైవేటుగా యం ఎ.కి

కట్టించు, చదివించు. అప్పుడు పెద్ద ఉద్యోగం వస్తుంది. అందుచేత ఎడ్వైస్ ఏమిటంటె కళ్లమూసుకుని ఒప్పేసుకో!"

పక్కగదిలో బియ్యంలో రాళ్ళేరుతూ కూర్చున్న లలిత తల్లి శారదమ్మగారు వెంటనే వీళ్ళు కూచున్న గదిలోకి వచ్చి-"అట్లా మీ స్నేహితురాలికి నచ్చచెప్పండమ్మా! బంగారంలాంటి సంబంధం యిది. పైగా వాళ్లేమో పిల్ల నచ్చింది, కట్న కానుకలతో నిమిత్తం లేదు అని చెప్పారు. ఇది చూస్తుంటే ఇంకా ఆలోచించాలి అటుంది. ఏమాలోచనలో ఏమిటో! ఈ కాలం పిల్లల వరసే ఇంత. మా కాలంలో ఈ పోకిళ్ళు లేవమ్మా! పెద్దవాళ్ళు ఎవర్ని చేసుకోమంటే వాళ్ళని చేసుకోవడమే!" అంటుంటే లలిత విసుగ్గా మొహంపెట్టి "అబ్బ. నీ కాలం సంగతులు మొదలుపెట్టావంటే తెల్లారుతుందే అమ్మా! ఇప్పు డెందుకవన్నీ! వూరుకో! కాసేపు మమ్మల్ని ఆలోచించుకోనీ!" అంది.

సరే! ఆలోచించేది ఏమిటో ఆలోచించుకుని. రాత్రికి మీ నాన్నగారువచ్చే వేళకి ఏ మాట చెప్పేయ్. అవతలవాళ్ళేమో ముహూర్తం పెట్టించమని తొందరపడుతున్నారు! అంటూ శారదమ్మగారు వంటింట్లోకి వెళ్ళిపోయింది.పద్మ. మంజరి, ఈ సంబంధం ఒదులుకోవద్దని కట్నంతో నిమిత్తం లేకుండా పెళ్ళాడే మగాళ్లు ఈ కాలంలో అరుదు అనీ, ఎన్నోవిధాలు లలితకి నచ్చచెప్పి వెళ్ళిపోయారు.

లలితకి ఆలోచించగా స్నేహితురాళ్ల సలహా నచ్చింది. కలలు ఫలించేటట్లు చేసుకోడం తన చేతుల్లోనే ఉంది. భర్తని తనకి అనుకూలంగా మలుచుకుని తాను నింగిలో సృష్టించుకున్న బంగరు ప్రేమమందిరంలోకి నడిపించుకుపోయే శక్తి తనలో ఉంది ఒకరి కలల్ని ఇంకొకరి కలల్లో హెచ్చవేసి, జగత్తు నిండా కలలు తోరణాలు కట్టి, ప్రేమమూర్తులై జీవితాన్ని సార్థకం చేసుకుంటారు.—ఆనందంతో అరిమూతలు పడ్డ కళ్లతో పక్క మీదకి వాలిపోయింది లలిత.

## 2

లలిత అంగీకారాన్ని పురస్కరించుకుని వెంటనే ముహూర్తాలు పెట్టించి, క్లుప్తంగా, ఆర్భాటం లేకుండా పెద్దలు పెళ్లి జరిపించేశారు. పెళ్ళయిన నెలలోనే లలిత మాధవరావుతో కాపురానికి వెళ్ళిపోయింది.

గజులపాలెం బాగా పల్లెటూరు. ఒక సినిమాహాలు గాని, క్లబ్బు గాని, పార్కుగాని, మహిళా సమాజాలుగాని లేవు. లలిత మామగారు ఆ ఊళ్లోనే ఒక ఎలిమెంటరీ స్కూల్లో మాష్టారు.

అత్తగారు సుందరమ్మగారు కూడా ఉత్తమురాలు. కోడల్ని అపురూపంగా చూసుకుంటుంది. మాధవరావు సరేసరి. లలిత అంటే అతనికి అపరిమిత అనురాగం ఏర్పడింది. పొద్దున్నే టిఫను చేసి పొలంవెళ్ళి మధ్యాహ్నం 12 గం॥ లకి ఇంటికి వచ్చేవాడు: ఇంక లలిత, అతను ఏవేవో కబుర్లు చెప్పుకుంటుంటే, 3 గంటలు అయ్యేది: 4 గంటలకల్లా ఊళ్లో చిన్నా, పెద్దా యింట్లో చేరేవాళ్లు మాధవరావు తనయింట్లోనే ఒక గదిలో మంచి లైబ్రరీ ఏర్పాటు చేసాడు. దిన పత్రికలు తెప్పించేవాడు. చదువురాని వాళ్ళకి తనే పుస్తకాలు, పేపర్లు చదివి వినిపించేవాడు. చదువంటే ఆసక్తివున్న పెద్దలకు చదువు నేర్పించేవాడు. సాయంత్రం పూట తోటలోకి భర్తతో అలా షైరు పోదామని లలిత కల. అది నిజమయ్యేట్లు కనిపించటం లేదు, ఆమె ఊహాలోకంలో...... సాయంత్రం అయ్యేప్పటికి చెట్టా పట్టా లేసుకుని బీచికో, సినిమాకో వెళ్ళాలి. ఇద్దరూ ఏ పదింటికో యింటికి రాగానే, వంటవాడు సిద్ధం చేసిన భోజనం తిని పడుకోవాలి. భర్త ఎప్పుడు తన ఎదురుగా కూర్చుని చూపుల్ని ఏకం చేస్తూ మాట్లాడుతూ, మైమరుస్తూ ఉండాలి.

ఒక నాడు సాయంత్రం చక్కగా నైలాన్ చీర కట్టుకుని, రెండుజడలు వేసుకుని, పౌడరు రాసుకుని సెంటు పూసుకొని, చేతికి వాచీ పెట్టుకుని, భర్త నెలాగో ఒప్పించి, వాళ్ళమామిడి తోటలోకి షికారుకి బయల్దేర దీసింది. ఇహ దారిపొడుగునా వింతవస్తువుని చూసినట్టుచూసారు. లలితని ఆపల్లెటూరి జనం. పైగా నాటి నుంచీ "మేష్టారి కోడలు సినిమాలో పిల్లలా రెండు జడలు వేసింది ఏమిటి ? ఒంటికి కప్పని ఆ పల్చని బట్టలేమిటి ? పైగా పట్టపగలు నడి రోడ్డు మీద మొగుడితో ఆ షికార్లేమిటి ?" అంటూ గుసగుస లాడ్డం మొదలెట్టారు అందు వల్ల ఇక షికారు కోరిక చంపేసుకుంది. అసలు ఆమెకిక్కడ ఏమీ పొద్దుపోవడం లేదు. ఏ కాలక్షేపం లేదు. భర్త పొలానికి వెళ్ళినపుడు ఏమీ తోచదు. ఉన్నప్పుడయినా అంత సేపూ తన తోనే కాలక్షేపం చెయ్యటంలేదు. తన యీడు చదువుకున్న పిల్లలెవరూ స్నేహం చేద్దాం అంటే లేరు. ఇక లలితకి పల్లెటూరు ముళ్ళ పక్కలా ఉంది. పట్టణానికి వెళ్ళాలి. అప్పుడు కాని తన కలలు నిజం కావు. ఇక్కడ కలలన్నీ కత్తులతో పొడిచేసుకోవాలి. కలల్లో లోకాన్ని నేల మీదికి దింపాలంటే పట్నంపోవాలి. పట్నం పోవాలి తప్పదు.

ఆ రోజు సుందరమ్మగారికి ఒంట్లో బాగా లేక పోవడంతో వంటపని లలిత మీదే పడింది. తన కలల్లో లలితకి ఈ వంటపని లేదు. ఎలాగో ఆప సోపాలు

పడి వంట పూర్తిచేసి, భర్తకి వడ్డించి. "వంట సరిగా కుదిరిందా ?" అని అడిగింది. మాధవరావుకి భార్యని నొప్పించడం ఇష్టంలేక "ఓ అద్భుతం కూర, పప్పుచారు, ఎంత బాగున్నాయి అవిచెప్పను?" అంటూ లొట్టలు వేస్తూ తినడం ప్రారంభించాడు, లలిత పొంగి పోయి.....

"కట్టెల పొయ్యి కాబట్టి ఇలా ఉందిగాని, అదే గ్యాస్‌పొయ్యి మీదయితేనా అంది. ఈ మాటతో తన పట్టణ వాసపు కోరిక వెల్లడయినట్లు భావించి, ఒక్క నిమిషంఆగి ఇట్లా అంది." ఏమండీ ఒక్కమాట చెప్తాను వింటారా ?

వింటారా ? ఏమిటి లలితా నువ్వు చెప్పడం నేను వినక పోవడమునా ?


ఎం లేదంటే ఏమీ తోచడం లేదు. నీటిలోంచి తీసిన చేపలా. ఈ ఊళ్ళో విలవిల లాడి పోతున్నాను. మీ రైనా బస్తీలో చదువుకుని ఈ పల్లె టూర్లో వుండడానికి ఇబ్బంది పడుతూనే వుండి వుంటారు ! అందుకని మీరు పట్నంలో ఉద్యోగం చూసుకోండి. హాయిగా ఉందాం ! లలిత ఆలోచనలు అదివర కే పసిగట్టిన మాధవరావు ఈ మాటలకేం ఆశ్చర్యపడలేదు. "ఇక్కడ వ్యవసాయం అదీ ఎట్లా లలితా ? మహా అయితే నాకు రెండొందల ఉద్యోగం వస్తుంది. దానితో నెల గడుస్తుందా ? అక్కడ అన్నీ కొనుక్కోవాలి !" అన్నాడు. అంత జీతం అయితే ఇంకేమండీ ? నేను రెండొందల్లో యెంత పొదుపుగా సంసారం గడుపుతానో చూడండి ! ఇక్కడ ఎంత కష్టపడినా పట్నంలోని సుఖం రాదండీ

మాధవరావు కొంచెం ఆలోచించి "సరే, నాన్ననిగూడ సంప్రదిద్దాం :" అన్నాడు. భర్త తన మాటని ఇంత సులువుగా అంగీకరించి నందుకు లలిత మనసు ఉప్పొంగిపో యింది. మాధవరావు తండ్రి రామయ్యగారికి ఈ ప్రతిపాదన ఇష్టం లేకపోయినా, బస్తీపిల్ల ఈ పల్లెలో ఇబ్బంది పడుతోందని కోడలిమీద జాలి వేసింది. అయినా తను వద్దంటే ఆమెకి పట్నంమీద మోజు ఇంకా పెరుగుతుంది గాని, లాభం వుండదు. వాళ్ళే స్వయంగా బస్తీలో సంసారం సాగిస్తూ, అందులోఉన్న కష్టనష్టాలు తెలుసుకుంటే మంచిది. ఇక్కడ సొంత ఇల్లు. పాడి పంటలు. అన్నీ ఎదురుగావుంటే వాటి విలువ తెలియదు. "పోనీ ! అదీ కొన్నాళ్ళు చూడు !" అన్నారు.

సుందరమ్మగారు కొడుకుని, కోడల్ని వదిలి వుండడం ఇష్టం లేకపోయినా చదువుకున్న పిల్ల, పొద్ద సమానం పల్లెటూర్లో ఏ సరదా లేకుండా వుండ లేదని సరిపెట్టుకున్నారు.

## 3

విశాఖపట్నంలో మాధవరావు స్నేహితుడు మురళి ఒక పెద్ద ప్రైవేటు




కంపెనీలో 1200 జీతంమీద పని చేస్తున్నాడు. ఆ స్నేహితుని ప్రయత్నం వల్ల మాధవరావుకి ఆ కంపెనీలోనే 250 రూ॥ల ఉద్యోగం వచ్చింది. మాధవరావు వెళ్ళి పనిలో జాయినై, మహారాణిపేటలో రెండు గదులు, 70 రూ॥ అద్దెకి తీసుకుని గాజులపాలెం వెళ్లి లలితని విశాఖపట్నం తీసుకు వచ్చాడు.

మాధవరావు స్నేహితుడు మురళి నాలుగురోజులు తమ యింట్లోనే ఉండమని బలవంతం చేయగా, వాళ్ళకి ఉండక తప్పిందికాదు. ఆధునిక సౌకర్యాలన్నీ కలిగి ఉండిన ఆ బంగళా, మురళి దంపతుల జీవితం, లలిత కలలకి ప్రతిరూపంలా కనిపించింది, మురళి భార్య శారద, లలితకి విశాఖలోని షిప్‌యార్డు, కాల్‌టెక్స్ అన్నీ చూపించింది. లలితని లేడీస్ క్లబ్‌లో మెంబరుగా చేర్పించింది. ఆ క్లబ్‌లో లలితకి చాలా ఆనందంగా కాలక్షేపం అవుతోంది. అట్లా వారం రోజులదాకా వారి బలవంతం మీద అక్కడే ఉంది, లలితా మాధవులు తమ ఇంటికి వచ్చేశారు. ఆ యింటావిడ కాంతమ్మగారు కూడా చాలా మంచిమనిషి. ఈ నూతన దంపతుల్ని చాలా ఆప్యాయంగా చూస్తుండేది. ఆమెది వీళ్ళ ఊరే!

ఒకనాడు మాధవరావు, లలితా సముద్రపు ఒడ్డుకు వెళ్ళారు. బీచి ఇసకలో నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళి సముద్రపు ఒడ్డున కూర్చున్నారు. తెల్లని కెరటాలు ఎగసి ఎగసి పడుతూ హోరుమని ఘోషిస్తున్నాయి లలిత కెరటాల వద్ద పాదాలు పెట్టూ, కాళ్ళు తడుస్తుంటే చిన్నపిల్లలా సంబరపడసాగింది. సము

ద్రంలోని నల్లని రాతిబండమీద కెరటాలు ఉవ్వెత్తుగాపడి. తెల్లని నురుగులు వెదజల్లి వెనక్కి వెళ్తుంటే తన్మయమై పోయింది లలిత. ఒంటరిగాను. జంటగాను వచ్చేవాళ్ళతో బీచి అంతా సందడిగా ఉంది. అప్పుడే కనుచీకటి పడింది. లైట్లు వెలిగాయి. ఇంకా తదేకంగా సముద్రాన్ని కెరటాల్ని చూస్తూ మైమరచిపోయిన లలితని భుజంమీద నెమ్మదిగా తట్టి మాధవరావు "ఇంక ఈ లోకంలోకి రండి అమ్మాయిగారూ ! చీకటి పడుతోంది!" అన్నాడు.

"అప్పుడే వెళ్ళిపోదామా ! ఎంత బాగుందియిక్కడకూర్చొంటే! ఎంత సేపు చూసినా, సముద్రం, కెరటాలు, ఆకాశం, అన్నీ మళ్ళీ కొత్తగానే కన్పిస్తున్నాయి" అంది సంతోషంతో.

"ఏమో మరి. నీ పక్కనకూర్చుంటే నాకు నీ అందం తప్ప మరేమీ కనిపించదు." అని మాధవరావు లలిత భుజం మీద చెయ్యివేశాడు. "పొండి ! మీరు మరీనూ" అంది లలిత గారంగా. ఇద్దరూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ఇంటికి చేరుకున్నారు. ఇలా ఊహాలోకాల్లో తేలిపోయింది లలిత. జీవితం పూలబాట మీద నడచిపోతున్నట్లుంది. పల్లెటూరి నుండి పట్టణానికి తీసుకునివచ్చి, యింత ఆనందభరితమైన జీవితాన్ని సాధించుకున్నందుకు ఉప్పొంగిపోతోంది ఆమెకి ఇదంతా కలల్లో జీవితం వాస్తవమౌతున్నట్లుంది గాని, వాస్తవజీవితం ఆమె కలల్ని ఇంకా చెదరగొట్టలేదు... కాలగర్భంలో మరికొన్ని నెలలు గడిచిపోయాయి.

## 4

ఒకరోజు లలిత, మాధవ్ మురళీ వాళ్ళ ఇంటికి వెళ్ళారు. మురళీ దంపతులు వారిని సాదరంగా ఆహ్వానించి, డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోబెట్టారు. మాధవ్ మురళీ ఏవో ఆఫీసు విషయాలు మాట్లాడుకుంటుండగా, శారద "లలితా ! రా! మనం అలా పెరట్లోకి వెళ్ళి కూర్చుందాం. అని తీసుకెళ్ళింది. విరబూసిన పూలతో నిండిన తోటలో మధ్య సిమెంటు బెంచీమీద యిద్దరూ కూర్చున్నారు.

"ఏమిటి విశేషాలు శారదా !" అంటూ లలిత కబుర్లలోకి దిగింది. శారద చెప్పడం ప్రారంభించింది.

"ఏం చెప్పను లలితా ! ఈ పట్నవాసం గురించి ఈ మధ్యనే 130 రూ.లు పెట్టి 'స్క్వేర్ వాచి' కొన్నాను. నిండా వారమన్నా కాలేదు. మేము సినిమా నుంచి వచ్చి రాత్రి మాటల మధ్యలో డ్రాయింగు రూంలో బల్లమీద పెట్టి మరచిపోయాము. ఆ మర్నాడు స్నానం అదీ అయ్యాక జ్ఞాపకంవచ్చి బల్లమీన చూస్తే వాచీలేదు. ఒక వాచీ ఏమిటి లలితా, ఏ వస్తువు లయినా సరే,

ఏమాత్రం ఏమరినా ఈ పట్నంలో మనవి కావనుకో! ఎంత విచిత్రంగా దొంగతనాలు పెరిగి పోతున్నాయని చెప్పను. కిటికీ తలుపులు తెరచివుంచే కిటికీలోంచి కర్రపెట్టి, వంకీనఉన్న బట్టలు లాగేసి ఎత్తుకు పోతున్నారు. ఇంట్లో పెద్ద దక్షత లేకపోటం, ఒంటరిగా ఇంట్లో వుండడం, నాకు భయంతో రోజల్లా బిక్కు బిక్కు మంటుంది. ఏం పట్నవాసం లలితా! పైపై మెరుగుల్నిచూసి రావడమేగాని, ఇక్కడ వస్తువుల ఖరీదులకి ఈ జీవితానికి మనం తట్టుకోలేం. మాకుఇంత జీతమొస్తున్నా, నెలలో సగం రోజులయ్యేసరికి డబ్బుకి ఇబ్బందిగా వుంటుంది!" "మీకు ఇబ్బందా!" అంది లలిత ఆశ్చర్యంగా. "ఆఁ అక్షరాలా. మా ఇంటికి అద్దె 350 రూ.లు, పాలవాడికి 250 రూ.లు, వంటాయనకి 70 రూ.లు పని మనిషికి 30 రూ.లు. పనివాళ్ళుచేసే దుబారా వీటన్నింటికి ఖర్చు ఎంతవుతుందో ఆలోచించావా! ఇవిగాక పట్నంలో తరచు ఏవో పార్టీలనీ, సినిమాలని వుండనే వుంటాయి కదా!

శారద మాటల్లో నిజం లలితకి బోధపడింది. అంతేకాదు నేనేదో పట్నవాసంలో జీతం సరిపోతుందని,హాయిగా గడపవచ్చు అని అనుకుంది. కానీ ప్రతినెలా అప్పులే! పైగా ఇంత డబ్బు ఖర్చయినా తమ ఊళ్ళోలా తిండి సుఖం లేదు. ఇల్లు సుఖం లేదు. లలిత కలలకి ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ఇంతట్లో "మీ కబుర్లు అయ్యాయా?" పొద్దుపోయింది. ఇంటికి పోదామా? అంటూ వచ్చాడు మాధవ్. వస్తాను శారదా! అని లలిత శారదతో చెప్పి. మాధవ్‌తో కలిసి రిక్షా ఎక్కింది. ఇంటికి చేరారు ఇద్దరూ.గుమ్మంలోనే కాంతమ్మగారు ఎదురై మాధవ్‌కి అవాళ వచ్చిన ఉత్తరాన్ని ఇచ్చింది. మాధవ్ లోపలికి వెళ్ళి లైటువేసి చదువుకుని లలితని పిలిచి చదవమని చేతికి ఇచ్చాడు.

"మాధవ్‌కి ఆశీస్సులు నువ్వు డబ్బుకి ఇబ్బంది పడుతున్నావని పంపమని వ్రాశావు. ఈ ఏడు వర్షాలు బాగా లేక పంటలు బాగా పండలేదు. అందులో నువ్వు వెళ్ళిపోయాక ఒక్కడ్నే వ్యవసాయం చూడలేకపోవడంతో, పంటలు మరింత దెబ్బతిన్నాయి. షావుకారి దగ్గర అప్పుతెచ్చి, నాలుగు నెలల క్రిందట నువ్వు కావాలంటే 100 రూపాయలు పంపాను కదా! అప్పుడే ఐపోయిందా? మీ జీతం అంతా ఏం చేస్తున్నారు? జాగ్రత్తగా ఉండండి. మీ అమ్మ గొలుసు తాకట్టుపెట్టి షావుకారి దగ్గర రెండువందలు అప్పుతెచ్చి పంపుతాను త్వరలో. మీ అమ్మ యిద్దరికీ దీవెనలు చెప్పమంది. క్షేమ సమాచారాలతో ఉత్తరం వ్రాయి.

ఉత్తరం చదివి లలిత భర్తతో అంది

"మామగార్ని డబ్బు పంపవద్దని వ్రాయండి. అత్తగారి గొలుసు తాకట్టు పెట్టడం దేనికి ?"

మరి, వెచ్చాల కొట్టుమీద 400రూ॥లు అప్పువుంది. ఎలా తీరుతుంది ? వాడు కనబడినప్పుడల్లా నన్నడుగుతున్నాడు" అన్నాడు మాధవ్ బాధగా.

పోనీలెండి నా గాజు లమ్మేద్దాం లెండి!" అన్నది లలిత.

"అబ్బెబ్బే! నీగాజులా! నేనెప్పుడూ ఆపని చెయ్యను. డబ్బు సిమి మిగుల్చు కోలేక పోగా, ఇంక ఉన్నవి అమ్ము కోవడమా ?

లలిత విషాదచ్ఛాయలు కమ్ముకున్న ముఖంతో ఇలా అంది.

"ఏమిటో భ్రమలో పడ్డానండి, ఇద్దరమే ప్రతినెలా కొంత మిగిల్చి వెనుకెయ్య వచ్చు అనుకున్నాము. పట్నంలో జీవితం ఇంత ఖరీదు అనుకోలేదండి ఏ వస్తువు చూసినా బోలెడంత ప్రియం వస్తువులో ఏమీ నాణ్యత వుండదు నెయ్యి వీసె 24 రూ॥ లు మనింటి నేతికీ దీనికీ ఏమీ సంబంధంలేదు. పాలు శేరు రెండు రూపాయిలు. కటిక నీళ్ళు. పని మనిషికి నెలకి 15 రూ॥ లు. 15 రోజులు నాగాలు. మన ఊళ్ళో ఊరికే దొరికే కూరలు ఇక్కడ వీశె రూపాయి న్నర పెట్టి కొనాలి. ఆఖరికి పచ్చి మంచి నీళ్ళు కడుపునిండా తాగుదామన్నా నీళ్ళకి కరువే! ఇంటావిడ మంచావిడయినా పక్కన అద్దెకిఉన్నావిడ రోజూ పేచీలు పెడుతుంది, మనశ్శాంతి లేకుండా. చూస్తున్నారు కదూ! తెల్లారి లేస్తూనే పాచి దగ్గర, పంపునీళ్ళ దగ్గర అక్కర లేని తగాదాలు కల్పిస్తుంది. ఈ బాధలు చూస్తుంటే స్వంత ఇంటిని మించిన స్వర్గం లేదని పిస్తోంది. ఎక్కడికయినా వెళదామన్నా బస్సులు అందకపోతే రిక్షాలకు బోలెడు డబ్బులు పొయ్యాల్సి వస్తోంది." ఇట్లా లలిత చెప్తుండగా ఏమిటమ్మా రిక్షాలంటున్నావు అంటు కాంతమ్మగారు ప్రవేశించింగా లలిత "ఏముంది పిన్నిగారు ? చక్కే పంలా గ్రామంలో ఉంటలేక పట్నంలో సుఖంగా ఉందామని వచ్చాను. కాని ఇక్కడ ఖర్చు చూస్తూంటే గుండె గుభేలుమంటోంది."

మాధవరావు తనలో తాను నవ్వు కున్నాడు. లలితకి జ్ఞానోదయమై నందులకు కాంతమ్మగారు చెప్పడం ప్రారంభించింది. "నిజమేనమ్మా! మేము అలాగే పట్నవాసం మోజులో పడి 40 ఎకరాల భూమి తెగ్గొట్టు కున్నాం". "కథంతా వివరంగా చెప్పండి లలితకి!" అంటూ మాధవ్ నవ్వాడు. "ఈ ఊరు మేం వచ్చి 20 సం॥లు అవు తుంది. భూములవల్ల మాకు ఏటా 12 వేలు.... వచ్చేవి. ఈ ఊరు వచ్చే సరికీ బ్యాంకులో 25 వేలు ఉండేవి. పిల్లలు చదువుల మిషతో, పట్నవాసం




మీద మోజుపడి వచ్చాం. పట్టణంలో ఇరుగు పొరుగు ఆఫీసర్లని చూసి ఆడంబర జీవితంపై ఆకర్షణ పెరిగింది. నేను లేడీస్‌క్లబ్బులో జేరాను. 200రూ॥ అద్దెతో ఇల్లు తీసుకున్నాం. వంటకీ, మిగిలిన పనులకి నౌకర్లని పెట్టుకున్నాం. పిల్లలు స్కూలు కెళ్ళడానికి కారు కొన్నాం. ఆయన పెద్ద పెద్ద వాళ్ళ స్నేహాలవల్ల తాగుడు, పేకాట క్లబ్బులలో నేర్చుకొన్నారు. ఇక టాకీసులకీ పిక్నిక్‌లకి డబ్బు మంచినీళ్ళుగా ఖర్చు పెట్టాం. హోదాకోసం బాగా ఖరీదైన చీరలు, నగలు కొనేదాన్ని. దగ్గరుండి వ్యవసాయం చూసుకోక పోవడంవల్ల ఏడాదికి 12 బస్తాలు పండేది, 5 బస్తాలకు దిగింది. అందులో రెండేళ్ళు వరుసగా పంటలు పోయాయి. ఇంటి సంగతి మా ఇద్దరిలో ఎవరికీ పట్టక పోవడంచే. ఇంట్లో వస్తువులు పనివాళ్లు కాజేస్తుండేవాళ్లు.

అదేమిటి అంటే నుంచున్న పళాన పనిమానేసి వెళ్ళిపోయేవారు. దాంతో పని చేసుకోవడం అంటే భయపడి, వాళ్ళేం చేసినా చూసీ చూడనట్లు ఊరుకునేదాన్ని. కొత్త పని వాళ్ళని కుదుర్చుకుందామన్నా కుదర నిచ్చేవారు కాదు. ఇట్లా ఖర్చు ఎక్కువై పోవడంతో, ఒకొక్క ఎకరం అమ్మేసుకుంటూ వచ్చాము. చివరికి 10 ఎకరాలు ఉన్నాయనగా కళ్ళు తెరుచుకున్నాయి. ఎమైనా పిల్లలకి నాలుగు అక్షరం ముక్కలు రావడంచే, ఇద్దరు మగ పిల్లలూ చెరో 400 తెచ్చుకుంటూ కలకత్తాలో ఉన్నారు. ఒక్కతే ఆడపిల్ల గదా అని అమ్మాయికి మెడిసన్ చెప్పించాము. ఆ అమ్మాయికి ఈ నెలలో హవుస్‌సర్జన్ అవుతుంది. కనుక మన

ఊరు వచ్చి ప్రాక్టీసు పెట్టిద్దాం అనుకుంటున్నా ! ఏమైనా అవసరా లుండి గాని,చదువుకోసం గాని పట్నం వచ్చినా అక్కడి షోకులలో పడి. డబ్బు వ్యయం చేసి, అప్పుల పాలవ్వకూడదు, తాహతుకు తగ్గట్టుండాలి. పట్టణంలో అవసరం లేని వాళ్ళు మా లా వ్యవసాయం మానుకుని, పట్నం వచ్చి డబ్బు తగలెయ్య కూడదు.ఇంత అనుభవం మీద మాకైనా ఈ జ్ఞానం కలిగింది. ఇక మా సావిత్రికి కూడా మాధవ్ లాగే ఆశయాలూ-ఆదర్శాలూ. పల్లెప్రజలకి వైద్య సౌకర్యం లేక ఎంతో బాధపడుతున్నారు. వాళ్ళకి సేవచెయ్యాలనుకుంటుంది. "పేద ప్రజలకి ఉచితంగా వైద్యం చేయ్యాలని దాని ఉద్దేశం." అంటూ కాంతమ్మగారు అంది. "విన్నావుగా లలితా ?" అంటూ మాధవ్ లలిత కళ్ళలోకి చూశాడు. ఇప్పుడు వాస్తవజీవితసమస్యలు వలయాలుగ తిరుగుతున్నాయి. సంతృప్తి పడిన మాధవ్ ఇలా అన్నాడు."

వాళ్ళ సావిత్రి కొద్ది రోజుల్లో మన ఊళ్లో ప్రాక్టీసు పెడుతుంది. కాబట్టి మన ఊళ్ళో వైద్యుని కొరత తీరుతుంది. ఈ మధ్య చౌదరిగారు, సినిమాహాలు కట్టిస్తున్నట్టు చెప్పారు. నువ్వు. పిన్నిగారు, సావిత్రి కలసి మనఊళ్ళో క్లబ్ ఓపెన్‌చెయ్యండి ఐతే మనక్లబ్ వినోదంతోపాటు విజ్ఞానం ఇచ్చేట్టు, సంఘానికి ఉపయోగపడేట్టు మలుచుకుందాం ! ఇక పార్కు ఒకటి కావాలి గదా ! అదెంత సేపు ,మన కరణంగార్ని. మునసబుగార్ని అడిగి కొంత స్థలం సంపాదించి ఊళ్ళోచందాలు వసూలుచేసి. చక్కని పార్కు ఏర్పాటు చేద్దాం, మనం అందరం కలసి కట్టుగా కృషిచేసి, మన గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చుకుందాం. మనం ఆధునిక నాగరికత అంటే మోజుపడి, పొలం పుట్రా అమ్ముకుని పట్టణాలవెంట పడేకంటే, మన గ్రామాల్నే అధునికంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నించాల్సి ఉంది. పల్లెల్లో ప్రజలు మూఢ విశ్వాసాలతో అజ్ఞానంతో ఉన్నారని వారిని అసహ్యించుకుని దూరంగా పోవడంకంటె వాళ్ళని సంస్కరించడానికి ప్రయత్నిద్దాం."

నిజం నాయనా బాగా చెప్పావ్ అన్నారు కాంతమ్మగారు. "ఏదెల్లా ఉన్నా మా లలిత వాస్తవాన్ని ఈనాడు గ్రహించినందుకు-నాకు చాలా ఆనందంగా ఉంది. ఇంక ఆమె నా ఆశయానికి చేరువగా వచ్చిందన్న నమ్మకం కలిగింది నిజంగా ఇది నా అదృష్టం" అన్నాడు మాధవ్.

"ఇక నా ఆశయాలూ, మీ ఆశయాలూ ఒకటేనండీ !"

లలిత మాటల్లో విశ్చలమైన, నిశ్చయం, భర్తమీద అనురాగం, వికసించిన వివేకం అన్నీ ప్రతిధ్వనించాయి మాధవ్ సంతృప్తిగాలలితవంక చూశాడు ●